కథా నిలయం
శ్రీకాకుళం

# బదిలీ

–డా॥ బి.దామోదరరావు

'ప్రభుత్వోద్యోగులకు త్వరలో బదిలీలు' పేపర్లో వార్త చదవగానే నా శ్రీమతి గాబరాగా పరుగెత్తుకొచ్చింది. చేతిలో పేపరు విసురుగా నా ముందు పడేస్తూ.

"నేననుకుంటూనే ఉన్నాను ఈ ముదనష్టపు బదిలీల పీడ ఉంటుందని. మొన్ననే చెబితే విన్నారూ, మీ ఆఫీసరెవరో కొత్తగా వచ్చాడు. చాలా స్ట్రిక్ట్ అంటూ ఏవేవో కథలు చెప్పారు కానీ, అందులో పనిచేసే మీ చిన్ననాటి స్నేహితున్ని కలిసిరండి అంటే విన్నారు కాదు. మళ్ళీ ఎక్కడికి వెళ్ళాలో ఏమిటో. ఇప్పటికే ఆంధ్రదేశం మూడొంతుల యాత్ర పూర్తయింది. ఈసారి మాత్రం నేను రాను. పిల్లలు అసలే ఇంటర్‌లో ఉన్నారు. మిమ్మల్ని ఏ గోదావరిలో వేసినా నేను పిల్లలతో హాయిగా ఇక్కడే ఉంటాను" అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

మొదట ఈ ఆధునిక పతివ్రత ధైర్యాన్ని మెచ్చుకుంటూనే కాస్త ఆలోచనలో పడ్డాడను. ఈ బదిలీల వల్ల విద్యార్థులకేమన్నా ప్రయోజనమా? లేక అధికారులకు గాని, ఉద్యోగులకు గాని లాభమా! పదవిలో ఉండే రాజకీయ నాయకులకు ఈ సాకుతో పోరాడే సంఘ నాయకులకు చేతినిండా పని, కొంతలో కొంత కొందరికి 'మనీ' కూడ.

అసలు బదిలీలు ఓ పద్ధతి ప్రకారం జరుగుతున్నాయా అంటే అదీలేదు. పైరవీ చేసుకునేవాడు కదలడు, వాడి సీటు పంచవర్షాలు దాటినా వదలడు. అంతలో సిటీ నుంచి ముందస్తు ఫోన్. "ఒరేయ్ కిట్టిగా, నిన్ను గోదావరి జిల్లాలోని బొబ్బర్లంక బదిలీ చేశార్రా. వెధవన్నర వెధవా. ముందు వచ్చి కలవరా అంటే కదలకపోతివి. నీ చావు నీవు చావు" అంటూ ఆత్మీయ మిత్రుని తిట్లు, దీవెనలు.

బదులు చెప్పేలోగానే ఫోన్ పెట్టేశాడు. ఈ మాత్రం దానికి ఫోన్‌బిల్లు దండగ అనుకున్నాడేమో తనే ఫోన్ చేశాడు.

"అరే నిజం చెప్పు, జోక్ చేశావు కదూ. రెండేళ్ళు పూర్తికాలేదురా బాబూ" అన్నాను నవ్వుతూ.

"జోక్ కాదు పాడు కాదు, నిజంగానే అయింది. నీ స్థానంలో వచ్చేవాడు మీ ఎమ్మెల్యే దగ్గిరి చుట్టం. వాడికి నగరం రావాలని కోరిక. ముందు వస్తే ఏదో తంటాలు పడేవాడ్ని. అయినా యమధర్మరాజు తమ్ముడైన ఈ కొత్త బాస్ రాత్రికి రాత్రే ఆర్డర్స్ టైప్ చేయించి మరీ పోస్ట్‌లో వేయించాడు. చేతనైతే వెళ్ళు లేదా రిలీవ్ అయ్యాక 'సిక్ లీవ్' పెట్టు" అంటూ ఫోన్ పెట్టేశాడు, తన చేతిలో ఏమీ లేదంటూ శంకరం.

నా ముఖం కళతప్పింది. "ఆ జిల్లా వాళ్ళు నా ఆఫీసులో ముగ్గురున్నారు. నన్నే అక్కడికి ఎందుకు వెయ్యాల" అని నా ప్రశ్నకు సమాధానం కనుక్కోవాలని ఇంటి దగ్గరలో ఉన్న సంఘం నాయకుడు బాబయ్య ఇంటికి వెళ్ళా. అక్కడ నలుగురైదుగురు బదిలీ బాధితులేమో ఉన్నారు. ఈ నాయకుడు అదో టైప్ అని తెలుసు. అతని గురించి, అతని పక్కనే ఉన్న విస్కీ బాటిల్ ఆ విషయం చెబుతూనే ఉంది. అయినా వసుదేవుడంతటి వాడు గాడిద కాళ్ళు పట్టుకున్నాడట అని మనసులో అనుకుని, విషయం వివరించి సలహా అడిగాను.

"చూడు బ్రదర్, ఓ నెల రోజులు లీవ్ పెట్టు. మాడిఫికేషన్ ట్రైచేద్దాం" అన్నాడు విలాసంగా సిగరెట్టు వెలిగిస్తూ. వాడి సొమ్మేంపోయింది కష్టం–నష్టం నాకేగా.

వాడి బామ్మర్ది మొండయ్యకు కూడ ట్రాన్స్‌ఫర్ అయింది. మరి దిగులెందుకు లేదో అర్థం కాలే. దిగులుగా, భార్య మాట విననందుకు, గతం చెప్పిన పాఠాలు విననందుకు, తనలో ఇంకా నిజాయితీ తగ్గనందుకు తగిన పాఠమిది అనుకున్నాను.

మర్నాడే అధికారి రిలీవ్ చేయడం, నేను 'లీవ్' పెట్టడం జరిగిపోయింది కానీ, 'లీవ్' వల్ల జీతం రాదని తెలిసి, జీవితంలో మొదటిసారి ఏడ్చేశాను.

## తిరగబడ్డ కవిత

తిలక్ కవిత తిరగబడింది
అమెరికాలో / సంతానం పండుతున్నది
ఇండియాలో
డాలర్లు పండుతున్నాయి.

–డా॥ గుమ్మా సాంబశివరావు

ఇకపై బదిలీల పైరవీ, బ్యాంక్ బ్యాలెన్స్ తరిగి పోతుందని దిగులు. అయిందేదో అయింది- లీవ్ క్యాన్సిల్ చేసుకో. మంత్రిగారితో కూడ కాదట. ముఖ్యమంత్రి చేయాలి. మీ ఎమ్మెల్యే ఉన్నాడుగా, ఆయన నీకెంతో మిత్రుడు. అతడు జ్వరంతో ఉన్నప్పుడు పలుకరించి వచ్చావు కదా, వెళ్ళి కలువు- మరో మిత్రుడి సలహా. వెళ్ళి కలిశా. ముఖం మాడ్చు కున్నాడు. మళ్ళీ వసుదేవుని పని గుర్తొచ్చి; వచ్చిన విషయం చెప్పా. బదిలీలు సర్వసాధారణం. ఇదో దైవఘటన అన్నట్టు చెప్పాడు. మరి మా ఆఫీసులో పదేళ్ళుగా పనిచేస్తున్న అతని తమ్మునికి బదిలీ ఎందుకు కాలేదో చెప్పడు. అడిగే ధైర్యం ఉంటే, బ్యాంక్ బ్యాలెన్స్ గురించి ఆలోచిస్తానా. రైపు హైదరాబాద్ రమ్మన్నాడు. చూద్దాం అన్నాడు. ఆశ మేల్కొంది. తెల్లవారి పదింటికే పోస్టాఫీసుకెళ్ళి ఆర్.డి. ఖాతా రద్దుచేసుకుని, వచ్చిన సొమ్ములో కొంత అరుంధతికి ఇచ్చి హైదరాబాద్ బస్ ఎక్కా.

ఎమ్మెల్యే క్వార్టర్స్ వెళ్తే, 'సార్' లేరండీ అని జవాబు. రెండ్రోజులు తిరిగినా దొరకలే. ఓ రోజు ఉదయం నాలుగు గంటలకే లేచి ఆయన క్వార్టర్ మెయిన్ గేటు ముందు నిలబడితే గూర్ఖా గద్దింపులు. చివరికి తొమ్మిది గంటలకు ఆయన నివాసానికి వెళితే, సెక్రటేరియట్‌కి వచ్చి కలవమన్నాడు. సరే అని పదకొండు గంటలకు గేట్ జవాన్ను మంచిచేసుకుని, ఎంతో కొంత ఇచ్చి ఆయన చెప్పిన మంత్రి చాంబర్‌కు వెళ్ళా. అక్కడంతా అయోమయం. అంతా రహస్య సంభాషణలు. ఎమ్మెల్యే వచ్చాడని మిత్రులు చెప్పారు. వాళ్ళ అప్లికేషన్స్ తీసుకుని మంత్రిగారిని కలవడానికి వెళ్ళాడట. మళ్ళీ రాగానే కలవమన్నారు వాళ్ళు. ఎమ్మెల్యే బయటికి వచ్చాడు. 'సార్, సార్' అంటున్నా చూసీ చూడనట్టు మరో అధికారితో మాట్లాడుతూ కారు ఎక్కి వెళ్ళి పోయాడు.

మళ్ళీ మర్నాడు వెళ్ళేసరికి ఊరికి వెళ్లిపోయినట్టు తెలిసింది.

రాత్రికి తిరుగు ప్రయాణం. కేవలం బస్ చార్జీలు మిగిలాయి. మర్నాడు ప్రయత్నించినా ఎమ్మెల్యేను కలవలేకపోయా. వారం గడిచింది. లీవ్‌లు అయి పోతున్నాయి 'లాస్ ఆఫ్ పే' తప్పేట్టుగా లేదు.

మరో మిత్రుడు ఎలాగో ఓలాగు తంటాలు పడి డబ్బు ఖర్చుచేసి మరీ దగ్గర్లోని మరోచోటుకు బదిలీ అయ్యాడు.

# అయిదు పెద్దది ఆరు చిన్నది

మనిషీ ఓ మనిషీ, 'నువ్వు మనిషివా?
మృగానివా?" అని
ఏ మనిషిని మృగానితో పోల్చకు...! అవి వింటే
సిగ్గుతో కుచించుకుపోతయ్యి.. ఏ వన్యప్రాణి
తనకున్న పొట్టకంటే పెద్ద పొట్టను పెంచదు
ఏ వనంలోనూ దొంది కుందేలో దొంది నెమలి
చిలకలు లేవు.. ఏ పక్షి తను నివసించేందుకు
గూడుకట్టుకుంటుందే కాని అద్దెకివ్వడానికి
గూడుకట్టదు.. ఏ మృగము తనది కాని భూమిని
ఆక్రమించవు.. ఓ మనిషీ ఇది నీకు
తెలుసా..? ఉమ్మడి బతుకులు జీవంతంగా
వున్నాయంటే అవి అడవులలోనే..!
ఓ మనిషీ ఇది తెలుసుకో.. మృగం ఎంతో
ఆత్మాభిమానం కలవి.. ఓ ఏనుగు కాళ్లకు
మరో ఏనుగు, స్వామీ నేను మీ సేవకుడినని
దండం పెట్టదు
జంతువులకు మూఢనమ్మకాలు లేనేలేవు..
నిప్పుకోడి కూడా నిప్పుల మీద నడవదు
మదంతో కళ్లు మూసుకుపోయి అక్రమంగా
ప్రవర్తించే ఓ మనిషి ఏనుగుకు తప్ప మరో
మృగానికి మదం ఎక్కదని నీకు తెలీనిదా..?
మతాలసలే లేవు..! క్రిస్టియన్ చిలక, హిందూ
పులి జైన కొంగ, బౌద్ధ ఆవు... సిక్కు సింహం
మహమ్మదీయ లేడి అని అడవి మృగాలను
చెప్పగలవా... దేముళ్ల
వాహనాలేమిటో తెలుసా.. ఓ దేముడు
నెమలిని, ఓ దేముడు దున్నపోతుని, ఇంకో దేముడు
ఎలుకను, సాక్షాత్ శ్రీమన్నారాయణుడు గరుడ
పక్షిని
వాహనాలుగా చేసుకున్నారు
ఏ మృగాన్ని మనిషి మెయ్యలేదు
మనిషిని వాహనంగా చేసుకుంటే కింద పడేస్తాడని
మృగాలన్నింటికి తెలుసు.. అందుకే ఆరిరివులున్న
మనిషి అయిదరివులున్న మృగానికంటే తక్కువ..!

-ఎ.సువర్ణ

## చుక్క-పురాణం

'చుక్క' ఆకాశంలో నక్షత్రం
చుక్కల్లో చుక్క చంద్రుడు
చుక్క నీరులేక జీవితం శూన్యం
చుక్క గొంతు దిగాలి తాగుబోతుకి
చుక్క బుగ్గ కలంకారం పెండ్లిలో
చుక్క చిన్నారి బుగ్గకు దిష్టిచుక్క
చుక్కాని నావకు ప్రాణం
చుక్కనే సంఖ్యల్లో బిందువంటారు
చుక్క పరిపూర్ణత భాషకు
చుక్క సాహిత్యంలో సార్థకతనొందు
చుక్క లేకపోతే గుక్కతిప్పుకోలేరు కదా!
చుక్క త్రిభుజంలో బిందువవుతుంది
చుక్క వృత్తాకారానికి కేంద్రం
చుక్కనే బిందువంటే, అదే శ్రీమాత
చుక్క బిందు మండల వాసికి ఆవాసం
చుక్క గణితంలో పూర్ణానుస్వారం (నిండు సున్న)
చుక్క అందానికి సంకేతం (చక్కని చుక్క)
చుక్క ముగ్గుకాధారమవుతుంది
చుక్కల రెండిటి నడుమ గీత వెలుస్తుంది
చుక్క మందుల్లో చుక్కలుగా నిలిచింది
చుక్క పనివాళ్ళ అరికాళ్ళకి అందం
చుక్క చిన్ని పాపల ఫాలాన చందమామ
చుక్క ముత్తైదువుల నుదుట బాలభానుడు
చుక్క కన్యల ముకాలను సింగారిస్తుంది
చుక్కల కోకలు, రైకలు మగువలకందం
చుక్క స్థానబలిమి కలిగి విలువ పెరిగేను (లెఖ్ఖల్లో)
చుక్క ద్రవాలను లెక్కించే కొలమానం
చుక్క శరీరాన పుట్టుమచ్చ
చుక్క జ్యోతిష్య శాస్త్రాన అదృష్టరేఖ
చుక్క సర్వాంతర్యామి
చుక్కకు సాటి ఇలలో 'చుక్కే' సాటిలేరు దానికి
చుక్క రేచుక్క - పగటి చుక్క!

-కందుకూరి సుందరలక్ష్మి

'మాడిఫికేషన్స్' గడువు ముగిసి 'బ్యాన్' వచ్చింది కాబట్టి ప్రభుత్వం మాత్రమే బదిలీలు చేయాలి. దానికి ముఖ్యమంత్రి పేషీ జోక్యం చేసుకోవాలి. తనతో కాదని తేలిపోయింది.

అప్పులు మొదలయ్యాయి. సంఘ నాయకుడు అచ్చమైన రాజకీయ నాయకుడయ్యాడు. ఓ చేదు నిజం మాత్రం చెప్పాడు.

బదిలీలు జరిగేటప్పుడు, సెక్షన్ గుమస్తా తన మిత్రుని కోసం నన్ను బలిచేసి, అతడు బదిలీ కావాలంటే నేను అక్కడ జాయిన్ అయ్యేట్టుగా గొప్ప ఫీట్ చేశాడని. ప్చ్.. కానీ ఏం చేయను.

అతడు ఇవి సరియైన బదిలీలు అంటాడు. పైగా లోలోపల ఏం జరిగిందో తెలియదు.

కష్టాల్లో చిక్కుకున్న వాళ్ళను, అన్యాయం అయిన వాళ్ళను ఆదుకుంటామని వాదించిన నాయకులు, ఎందుకు ముఖం చాటేస్తారో శంకరం చక్కగా చెప్పాడు. వాళ్ళు ఎవరి వల్ల తమకు లాభముంటే వాళ్ళ పనులు చేసిపెట్టారని- జ్ఞానోదయం అయ్యేసరికి, అరవై వేల అప్పు. ఎనిమిది నెలల లీవ్ పూర్తిగా నష్టపోయాను. విపరీతమైన తిరుగుడు వల్ల ఆరోగ్యం క్షీణించింది.

మధ్య మధ్య అరుంధతి తానూ వస్తానని అన్నా వినిపించుకోలే. పిల్లల చదువులు, సొంత ఇల్లు. ఇక్కడికి ఇరవై ఏళ్ళ సర్వీస్ తర్వాత చేరుకున్నానన్న మమకారం. ఇది అన్యాయమైన బదిలీ అని కొంత పట్టుదల నన్ను ఆలోచనా రహితుడ్ని చేసింది. పైగా ఉన్నతాధికారుల నుంచి రిమేండ్ ఉత్తర్వులు. చేరకపోతే సర్వీస్ నుంచి తొలగిస్తామని బెదిరింపులు. ఇక లాభం లేదని, ఈ సమాజంలో కొన్ని అన్యాయాలకు కొందరు బలికాక తప్పదని, తన బాధ చిన్నదని, ఉద్యోగం లేనివాళ్ళ గురించి ఆలోచించి, కొత్తచోటుకు చేరాక తెలిసింది, అది ఎంతో మంచి చోటని. చక్కని పల్లె వాతావరణంలో నా బాధలు మరిచా. పిల్లలు హాస్టల్లో చేరారు. అరుంధతి తోడుగా.

రాజమండ్రి పరిసర ప్రాంతాలు తిరిగా- ఈ విశాల విశ్వంలో పర్యటించడం కొత్త అనుబంధాలు, ఆప్యాయతలు, అనుభవాలు పెంచుకోవడం కూడ అవసరమేమో అనిపించింది.. నా మిత్రుడు కిరణ్ ప్రైవేట్ సంస్థలో గొడ్డుచాకిరి చేస్తూ పక్క ఊరిలోని అందాలు చూడటానికి ఆరేళ్ళు పట్టిందని తెలిసి, నా బాధలకు ఉపశమనం లభించినట్టయింది. అవును, అనుభవమే గొప్ప పాఠం కదూ. ■